క్లుప్తంగా

టీపీసీసీ అధ్యక్షుడితో ఎమ్మెల్యే భేటీ



వర్ధన్నపేట : స్థానిక ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్‌తో హైదరాబాద్‌లోని నివాసంలో శుక్రవారం భేటీ అయ్యారు. నియోజకవర్గంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులతోపాటు పార్టీ కార్యక్రమాలపై చర్చించారు. నియోజక వర్గ అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఎమ్మెల్యే వెంట టీపీసీసీ నాయకుడు దొమ్మాటి సాంబయ్య, మైనార్టీ నాయకుడు మహ్మద్ చోటే, తదితరులున్నారు.

'డ్రంకెన్ డ్రైవ్'లో జైలు శిక్ష

వర్ధన్నపేట : మద్యం మత్తులో వాహనం నడుపుతూ పట్టుబడిన వ్యక్తికి న్యాయమూర్తి జైలు శిక్ష విధించాడు. స్థానిక సీఐ శ్రీనివాస్ కథనం ప్రకారం.. జఫర్‌గఢ్ మండలం కేంద్రానికి చెందిన మారేపల్లి శంకర్ ఈనెల 9న పట్టణంలో వాహనాల తనిఖీ సందర్భంగా మద్యం మత్తులో వాహనం నడుపుతూ పోలీసులకు చిక్కాడు. పోలీసులతో దురుసుగా ప్రవర్తించాడు. ఈ క్రమంలో జిల్లా కోర్టులో ప్రవేశ పెట్టగా మూడ్రోజుల జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చారని చెప్పారు. శంకర్‌ను హుజూరాబాద్ జైలుకు తరలించినట్లు తెలిపారు.

జల్లి వాసికి డాక్టరేట్



నర్సంపేట : చెన్నారావుపేట మండలంలోకి జల్లి గ్రామానికి చెందిన సంగెం సతీశ్ ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ అందుకున్నాడు. ఆయన భూభౌతిక శాస్త్ర విభాగం నుంచి ప్రొఫెసర్ వీరయ్య మార్గదర్శకత్వంలో 'రిజర్వాయర్ క్యారెక్టరైజేషన్ స్టడీస్ ఫర్ హైడ్రో కార్బన్ ఎక్స్‌ప్లోరేషన్ బేస్డ్ ఆన్ త్రీడీ సెస్మిక్ డేటా ఆఫ్ ఎలమంచిలి-రాజోలు ఏరియా, కృష్ణా-గోదావరి బేసిన్-ఇండియా' అంశంపై చేసిన పరిశోధనకు గాను విశ్వవిద్యాలయ అధికారులు డాక్టరేట్ అందజేశారు. ఈ సందర్భంగా సతీశ్‌ను కుటుంబ సభ్యులు, గ్రామస్తులు అభినందించారు.

అనుమానితులతో జాగ్రత్త

పర్వతగిరి : గ్రామాల్లో కొద్ది రోజులుగా చోరీలు జరుగుతున్న క్రమంలో ప్రజలు అనుమానితుల పట్ల జాగ్రత్తగా ఉండాలని ఎస్సై బోగం ప్రవీణ్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. నెక్కొండ మండలలోని పనికర శివారులో ఒంటరిగా ఉన్న మహిళ ఇంట్లోకి ఇద్దరు వ్యక్తులు శుక్రవారం చొరబడి మెడపై కత్తి పెట్టి చెవి కమ్మలతోపాటు బీరువాలో ఉన్న బంగారం, నగదు ఎత్తుకెళ్లారని పేర్కొన్నారు. దుండగులు ముఖానికి మాస్క్ ధరించి చేతులకు గౌజ్‌లు వేసుకున్నట్టు తెలిపారు. గ్రామాల్లో అనుమానితులు సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు.

పరామర్శ



నెక్కొండ : మండలంలోని సూరిపల్లికి చెందిన తన వ్యక్తిగత సహాయకుడు చెంగల రవీందర్‌ను అతడి తండ్రి మొగిలయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన క్రమంలో స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి శుక్రవారం పరామర్శించారు. తొలుత మొగిలయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. మొగిలయ్య మృతి బాధాకరమన్నారు.

బీఆర్ఎస్ నాయకుడికి..



సంగెం : మండలంలోని కుంటపల్లికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు ఎలుకుర్తి బుచ్చిరెడ్డిని అతడి అల్లుడు రామకృష్ణారెడ్డి ఇటీవల మృతి చెందిన క్రమంలో హైదరాబాద్‌లోని నివాసంలో పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి శుక్రవారం పరామర్శించారు. తొలుత రామకృష్ణారెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. ప్రగాఢ సానుభూతి తెలిపారు. ధర్మారెడ్డి వెంట రవికుమార్, తదితరులున్నారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

నర్సంపేట : పట్టణంలోని శ్రీభూనీళా సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో నేడు (శనివారం) ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ చైర్మన్ ఎర్ర జగన్‌మోహన్‌రెడ్డి, అర్చకుడు ముడుంబై రామానుజాచార్యులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీపీ, షుగర్, ఇతర సాధారణ వైద్య పరీక్షలు నిర్వహించడంతోపాటు మందులు పంపిణీ చేస్తారని పేర్కొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో కంపు

- నానాటికీ పేరుకుపోతున్న చెత్తాచెదారం
- రోగులు, ఉద్యోగులు, సిబ్బందికి ఇబ్బంది



ఆస్పత్రి ఆవరణలో పేరుకుపోయిన చెత్తాచెదారం

నర్సంపేట రూరల్ : పట్టణంలో ప్రభుత్వ ఆస్పత్రి పాత భవనం కొద్ది రోజులుగా కంపు కొడుతోంది. మున్సిపల్ అధికారులు, పారిశుద్ధ్య కార్మికుల నిర్లక్ష్యంగా ఆస్పత్రి ఆవరణలోని చెత్తాచెదారం నానాటికీ పెరిగిపోతుండడంతో రోగులు, ఉద్యోగులు, సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. వర్షాకాలం మొదలైన క్రమంలో సీజనల్ వ్యాధులతో ఆస్పత్రిలో చేరుతున్న రోగులకు వైద్యులు, సిబ్బంది ఎప్పటికప్పుడు వైద్యసేవలు అందిస్తూ డిశ్చార్జ్ చేస్తున్నప్పటికీ విషజ్వరాల బారిన పడే ప్రమాదం ఉందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పట్టణంలోని సర్వాపురం శివారులో ప్రభుత్వ ఆస్పత్రి నూతన భవనం నిర్మించినప్పటికీ పలు కారణాలతో పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రి పాత భవనంలో 80 పడకలతో ఇన్ పేషెంట్ (ఐపీ) సేవలు కొనసాగుతున్నాయి. నర్సంపేట డివిజన్ పరిధిలోని ఆరు మండలాల నుంచే కాకుండా పర్వతగిరి, కొత్తగూడ, గంగారం, మల్లంపల్లి మండలాల నుంచి రోగులు ఆస్పత్రికి వచ్చి వైద్యం చేయించుకుంటున్నారు. ఈ క్రమంలో 80 పడకలు సరిపోకపోతుండడంతో వైద్యులు రోగులనను ఆస్పత్రిలో చేర్చుకున్న రెండు, మూడు రోజుల్లోనే డిశ్చార్జ్ చేస్తూ కొత్తగా ఆస్పత్రిలో చేరుతున్న వారికి పడకల సమస్య తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

వారం, పది రోజులకోసారి చెత్త సేకరణ

ప్రతిరోజూ ఆస్పత్రిలో రోగుల అటెండెంట్లు ఆస్పత్రి ఆవరణలో వేస్తున్న చెత్తాచెదారం, వైద్యసిబ్బంది వినియోగించి పడేస్తున్న వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. చెత్తాచెదారాన్ని ఏరోజుకారోజే తొలగించాల్సిన పారిశుద్ధ్య సిబ్బంది కొంత కాలంగా ఆస్పత్రిలో వారానికోసారి చెత్త సేకరణ చేపడుతున్నారు. కొద్ది రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో ఆస్పత్రికి రోగుల తాకిడి పెరిగింది. చెత్తాచెదారం సైతం పెరిగిపోతుండగా పారిశుద్ధ్య కార్మికులు వారానికోసారి సైతం రాకుండా 10-15 రోజులకోసారి చెత్తాచెదారం తీసుకెళ్తున్నట్టు తెలుస్తోంది. ఈ క్రమంలో ఆస్పత్రిలో చేరిన రోగులు, ఉద్యోగులు, సిబ్బంది దుర్గంధంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ముక్కు మూసుకుని కాలం గడుపుతున్నామంటూ పలువురు బహిరంగంగానే అసహనం వ్యక్తం చేస్తున్నారు.

దోమల బెడద..

వర్షాకాలం ప్రారంభమైన క్రమంలో చెత్తాచెదారం పేరుకుపోతుండగా దోమల బెడద తారెత్తిస్తోంది. చెత్త నుంచి దోమలు వ్యాప్తి చెందుతుండగా రోగులు, ఉద్యోగులు, సిబ్బంది దోమలు ప్రబలుతుండడంతో సీజనల్ వ్యాధులతో భయాందోళనకు గురవుతున్నారు. ఇకనైనా వైద్యశాఖ, మున్సిపల్ ఉన్నతాధికారులు స్పందించి ప్రతిరోజు చెత్తను పారిశుద్ధ్య సిబ్బంది తీసుకెళ్లేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. చెత్త తొలగింపులో నిర్లక్ష్యం చేస్తున్న వారిని గుర్తింపు చర్యలు తీసుకోవాలని ప్రజలు, రోగులు కోరుతున్నారు. ఇకనైనా ఆస్పత్రి వర్గాలు, మున్సిపల్ ఉన్నతాధికారులు స్పందించి పారిశుద్ధ్య సిబ్బంది ప్రతిరోజూ చెత్త సేకరించేలా చర్యలు చేపట్టడంతోపాటు చెత్తాచెదారం సేకరణలో నిర్లక్ష్యానికి బాధ్యులైన వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని జనం డిమాండ్ చేస్తున్నారు.

సమస్య పరిష్కరిస్తా..

చెత్తాచెదారం పేరుకుపోయి రోగులు, ఉద్యోగులు, సిబ్బంది ఇబ్బంది పడుతున్న విషయం మా దృష్టికి వచ్చింది. సమస్యను మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్తా. సత్వరమే పరిష్కరించేలా కృషి చేస్తా.

– డాక్టర్ కిషన్, ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్

మాజీ ఎమ్మెల్యే ఓంకార్ స్ఫూర్తితో పోరాడాలి

- రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు



సమావేశంలో మాట్లాడుతున్న పెద్దారపు రమేశ్

నర్సంపేట : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై మాజీ ఎమ్మెల్యే ఓంకార్ స్ఫూర్తితో పోరాడాలని వక్తలు పిలుపునిచ్చారు. ఓంకార్ శతజయంతి ఉత్సవాల సందర్భంగా వామపక్ష కమ్యూనిస్టు, సామాజిక ప్రజాసంఘాల బాధ్యులతో పట్టణంలోని ఓంకార్ భవన్‌లో ఎంసీపీఐ(యూ) డివిజన్ కార్యదర్శి మహ్మద్ రాజాసాహెబ్ అధ్యక్షతన 'పౌర హక్కుల పరిరక్షణ-ఓంకార్ పాత్ర' అంశంపై శుక్రవారం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేశ్, సీపీఐ జిల్లా నాయకుడు అక్కపెల్లి రమేశ్, టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు షేక్ జావిద్, న్యూడెమోక్రసీ నాయకుడు ఎలకంటి రాజేందర్, మాస్ లైన్ డివిజన్ కార్యదర్శి అడ్డూరి రాజు, ఎంఆర్‌పీఎస్ జాతీయ నాయకుడు కల్లెపల్లి ప్రణయ్ దీప్, డీబీఆర్ఎస్ నాయకులు అందె రవి మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసేలా ఈడీ, సీబీఐ లాంటి స్వతంత్ర సంస్థలను గుప్పిట్లో పెట్టుకుని ప్రతిపక్షాలను అణచివేస్తోందని తెలిపారు. అటవీ, ఖనిజ సంపదను కార్పొరేట్ సంస్థలకు దోచి పెట్టేందుకే కేంద్ర ప్రభుత్వం కగార్ పేరుతో మావోయిస్టులపై దాడి చేస్తున్నట్టు ప్రచారం చేస్తూ అమాయక ఆదివాసీలను హతమారుస్తోందని చెప్పారు. ఎమ్మెల్యేగా మద్దికాయల ఓంకార్ భార్గవ కమిషన్ ఎదుట సాక్షులను ప్రవేశపెట్టి పాలకవర్గాల బూటకపు ఎన్‌కౌంటర్ల గుట్టు రట్టు చేశారని గుర్తు చేశారు. సమావేశంలో వామపక్ష, కమ్యూనిస్టు, సామాజిక ప్రజాసంఘాల నాయకులు కుసుంబ బాబురావు, నాగెల్లి కొమురయ్య, వంగల రాగసుధ, కొత్తకొండ రాజమౌళి, సదానందం, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యంపై విద్యార్థులు పోరాడాలి



ప్రధాన రహదారిపై రాస్తారోకో చేస్తున్న నాయకులు, విద్యార్థులు

- ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్

వర్ధన్నపేట : ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ విడుదలలో ప్రభుత్వం నిర్లక్ష్యంపై విద్యార్థులు పోరాడాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు చుక్క ప్రశాంత్ కోరారు. ఆ సంఘం మండల కార్యదర్శి ఇస్లావత్ కల్యాణ్ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రధాన రహదారిపై శుక్రవారం రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా ప్రశాంత్ మాట్లాడారు. ఆరేళ్లుగా స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకుండా మోసపూరితంగా వ్యవహరించడం సరికాదన్నారు. అనేక హామీలు గుప్పించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సైతం పెండింగ్ పెట్టిందని విమర్శించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయకపోవడంతో పేద విద్యార్థులు ఉన్నత చదువులకు దూరం అవుతున్నారని ఆందోళన వెలిబుచ్చారు. ఇకనైనా బకాయిలు విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మహేశ్వరి, అక్షిత, అశ్విని, శివాని, పౌర్ణమి, సాయి గణేశ్, మోనో, చరణ్, కార్తీక్, జస్వంత్, సాత్విక్, అన్వేశ్, అభినయ్ పాల్గొన్నారు.

పింఛన్ పెంపులో నిర్లక్ష్యం సరికాదు

- ఎమ్మార్పీఎస్ అధికార ప్రతినిధి గోపాల్



సమావేశంలో మాట్లాడుతున్న మాసాని గోపాల్

సంగెం : దివ్యాంగులకు, వృద్ధులకు, వితంతువులకు పింఛను పెంచడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి మాసాని గోపాల్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన వీహెచ్‌పీఎస్ ముఖ్యకార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా దివ్యాంగులకు రూ.6 వేలు, వృద్ధులు, వితంతవులకు రూ.4 వేలు చొప్పున పింఛన్ ఇస్తామని నమ్మించి ఓట్లు దండుకుందని చెప్పారు. ఇకనైనా వెంటనే పింఛన్ పెంచాలని, దివ్యాంగులకు రాజకీయ రిజర్వేషన్ కల్పిస్తూ చట్ట సవరణ చేయాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వీహెచ్‌పీఎస్ మండల అధ్యక్షుడు చిర్ర బాబు, సభ్యులు దామెరుప్పుల వెంకటేశ్వర్లు, గుండేటి అనిల్, లింగమయ్య, మల్లేశం, మల్లయ్య, గుండేటి శ్యామ్ కుమార్, వాసు తదితరులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్ల పెంపుపై హర్షం

గీసుకొండ/పర్వతగిరి : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలపడం పట్ల కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పిన్నింటి అనిల్‌రావు, తెలంగాణ బీసీ ప్రజాసంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు నాయిని భరత్ శుక్రవారం హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు అనిల్‌రావు మీడియాతో మాట్లాడగా భరత్ పత్రిక ప్రకటన విడుదల చేశారు. గతంలో బీఆర్ఎస్ 32 శాతంగా ఉన్న బీసీ రిజర్వేషన్ను 23 శాతానికి తగ్గించి తీరని అన్యాయం చేసిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం న్యాయబద్ధంగా నిర్ణయం తీసుకుందని తెలిపారు.

విద్యార్థులకు పురస్కారాలు

ఆత్మకూరు : మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్ నుంచి పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన 12 మంది విద్యార్థులకు శుక్రవారం కరీంనగర్ జిల్లా పరిధిలోని హుజూరాబాద్ మండలానికి చెందిన గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వాహకుడు గంగిశెట్టి జగదీశ్వర్ పురస్కారాలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సై తిరుపతి, హెచ్ఎం నిర్మలకుమారి విద్యార్థులకు డిక్షనరీలు, జ్ఞాపికలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులు శ్రద్ధగా చదివి ఉన్నస్థానాల్లో నిలవాలని ఆకాంక్షించారు.

ప్రపంచ జనాభా దినోత్సవం



నెక్కొండ : మండలంలోని పెద్దకొర్పోలులో అలంకానిపేట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ జనాభా దినోత్సవం నిర్వహించారు. కస్తూర్బా గాంధీ గురుకుల విద్యాలయలోని విద్యార్థులకు వైద్యుడు అఖిల్ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. జనాభా పెరుగుదలతో తలెత్తే అనార్థలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించాలని సూచించారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో విద్యాలయ ప్రత్యేక అధికారి సరిత, సూపర్‌వైజర్ రమాదేవి, ఉద్యోగి కరుణ, ఆశ కార్యకర్త జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

వనభోజనాల సందడి



నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని మాధన్నపేట, నాగుర్లపల్లి గ్రామాల్లో శుక్రవారం వనభోజనాల సందడి నెలకొంది. ఆషాఢ మాసం సందర్భంగా ఆయా గ్రామాలకు చెందిన ముదిరాజ్ కులస్తులు మాధన్నపేట చెరువు మీద వన భోజనాలకు వెళ్లారు. కట్ట మైసమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జంతువులను బలి ఇచ్చారు.

పర్వతగిరి : మండల కేంద్రంలో మాల కుల సంఘం ఆధ్వర్యంలో వన భోజనాలు నిర్వహించారు. రిజర్వాయర్ సమీపంలోని వన మైసమ్మకు మాజీ ఎంపీటీసీ మాడుగుల రాజు ఆధ్వర్యంలో పూజలు చేశారు. మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో కుల పెద్దలు చిదురు మల్లేశ్, నాదరపు నర్సయ్య, మాజీ వార్డు సభ్యులు నాగుల బాబు, చిదురు తిరుపతి, చెనమాల నర్సయ్య, పబ్బ శంకర్, తుంగ రాజు, చిదురు యాకయ్య, మాడుగుల అఖిల్, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నర్సంపేట : పట్టణంలోని వల్లభ్‌నగర్, మహేశ్వరం సబ్‌స్టేషన్లలో మరమ్మతుల నేపథ్యంలో నేడు (శనివారం) విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఆ శాఖ అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలో, మహేశ్వరం సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో ఉదయం 8.30 నుంచి 10.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తామని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

యాగానికి రావాలని ఎమ్మెల్యేకు ఆహ్వానం



ఆహ్వాన పత్రిక అందజేస్తున్న గణేశ్, తదితరులు

ఆత్మకూరు : ఈనెల 14,15,16వ తేదీన హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర ధూపదీప నైవేద్య అర్చక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న పంచకుండాత్మక చండీ కుబేర పాశుపత యాగానికి రావాలని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డికి అర్చక సంఘం ప్రతినిధులు ఆహ్వానం అందించారు. మండలకేంద్రంలో శుక్రవారం ఎమ్మెల్యేను ధూపదీప నైవేద్య అర్చక సంఘం జిల్లా అధ్యక్షుడు గణేశ్ సిద్ధాంతి, ఉపాధ్యక్షులు లక్ష్మీకాంతశర్మ, ప్రధాన కార్యదర్శి మాధవమూర్తి, కోశాధికారి వీరమల్లయ్య, ప్రచార కార్యదర్శి పురుషోత్తమాచార్యులు, గౌరవ సలహాదారు నర్సయ్య శర్మ కలిసి ఆహ్వానం అందించారు.

డ్రోన్ టెక్నాలజీతో అధిక లాభాలు

- నర్సంపేట ఏడీఏ దామోదర్‌రెడ్డి



డ్రోన్ టెక్నాలజీపై వివరిస్తున్న దామోదర్‌రెడ్డి

నల్లబెల్లి : డ్రోన్ టెక్నాలజీతో పంటలు సాగు చేస్తే అధిక లాభాలు వస్తాయని నర్సంపేట ఏడీఏ దామోదర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని రేలకుంటలో వ్యవసాయ శాఖ, ఇఫ్కో సంయుక్త ఆధ్వర్యంలో డ్రోన్‌తో నానో యూరియా, నానో డీఏపీ మందుల పిచికారీపై శుక్రవారం నిర్వహించిన ప్రదర్శనను ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేసే దిశగా ప్రభుత్వం డ్రోన్ టెక్నాలజీతో పంట పొలాల్లో నానో యూరియా పిచికారీ చేయడాన్ని ప్రోత్సహిస్తోందని తెలిపారు. డ్రోన్ టెక్నాలజీతో నానో యూరియా పిచికారీ చేస్తే పెట్టుబడి తగ్గడంతోపాటు దిగుబడి పెరుగుతుందని చెప్పారు. నానో యూరియా వినియోగం వల్ల రసాయనిక ఎరువుల దిగుమతిపై విదేశీ మారక ద్రవ్య, సబ్సిడీ ఖర్చులు తగ్గుతాయని తెలిపారు. డ్రోన్ టెక్నాలజీతో పొలాల్లో నానో యూరియా, డీఏపీ పిచికారీతో కలిగే ప్రయోజ నాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని వివరించారు. ఇఫ్కో మార్కెటింగ్ ఆఫీసర్ విశాల్ షిండే మాట్లాడుతూ డ్రోన్ పని విధానం, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. తక్కువ ధరకే డ్రోన్ సేవలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి (ఏఓ) బన్న రజిత, ఏఈఓలు శ్రీకాంత్, ఇఫ్కో ప్రతినిధి జీవన్, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణంలో నిబంధనలు తప్పనిసరి

- ఇన్‌చార్జ్ ఎంపీడీఓ పాక శ్రీనివాస్



మంజూరు పత్రాలు ఇస్తున్న ఇన్‌చార్జ్ ఎంపీడీఓ

గీసుకొండ : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ పాక శ్రీనివాస్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో పలువురు లబ్ధిదారులకు శుక్రవారం ఆయన ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు అందజేశారు. అలాగే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలపై ఉద్యోగులకు, ఇందిరమ్మ కమిటీల సభ్యులకు అవగాహన కల్పించారు. లబ్ధిదారులకు నిర్మాణాలకు అనుగుణంగా బిల్లులు అందు తాయని చెప్పారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 62 మందికి మంజూరు పత్రాలు అందజేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో కార్యాలయ సూపరింటెండెంట్ కమలాకర్, ఏఈ వినోద్, కాంగ్రెస్ నాయకులు చాడ కొమురారెడ్డి, తుమ్మనపెల్లి శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, కూసం రమేశ్, పత్తిపాక రవీందర్, సాగారపు స్వామి, జన్ను రమేశ్, దాడి శివ, లక్కర్సు రవి కుమార్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం



సంగెం : గవిచర్లలో పాటలు పాడుతున్న సాంస్కృతిక సారథి కళాకారులు

- ఏపీఎంలు కిషన్, శ్రీనివాస్



నెక్కొండ : మాట్లాడుతున్న ఏపీఎం శ్రీనివాస్

నర్సంపేట/సంగెం/నెక్కొండ/వర్ధన్నపేట : మహిళల ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం మహిళా సంఘాల సభ్యులు వడ్డీలేని రుణాలు, ఇతర పథకాలు అమలు చేస్తోందని సంగెం, నెక్కొండ ఏపీఎంలు కిషన్, శ్రీనివాస్, చెన్నారావుపేట మండల ప్రాజెక్టు మేనేజర్ ముక్కెర ఈశ్వర్ తెలిపారు. చెన్నారావుపేట, సంగెం, నెక్కొండ, వర్ధన్నపేట మండలాల్లో శుక్రవారం నిర్వహించిన ఇందిరా మహిళా శక్తి సంబురాలకు వారు హాజరై మాట్లాడారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టిందని తెలిపారు. మహిళా సంఘాల సభ్యులు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను వినియోగించుకుని ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం కావాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు అవగాహన కల్పించారు.

దివ్యాంగుడికి బీజేపీ నాయకుల ఆదరణ



దివ్యాంగుడికి దుస్తులు అందిస్తున్న నాయకులు

నల్లబెల్లి : మండల కేంద్రానికి చెందిన దివ్యాంగుడు జన్ను సుదర్శన్ సుమారు 20 ఏళ్లుగా చెట్టు కిందే జీవనం సాగిస్తుండగా ఆయన్ను బీజేపీ నాయకులు ఆదరించారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆ పార్టీ మండల అధ్యక్షుడు తడక వినయ్ ఆధ్వర్యంలో సుదర్శన్‌కు శుక్రవారం కటింగ్, షేవింగ్ చేయించారు. స్నానం పోసి నూతన దుస్తులు అందజేశారు. సుదర్శన్ నివాసం ఉండేలా రేకుల షెడ్డు ఏర్పాటు చేశారు. తొలుత బస్టాండ్ ఆవరణలో కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ఈర్ల నాగరాజు, నాయకులు తిమ్మాపురం శివ, గుర్రపు నరేశ్, సింగిరెడ్డి యాదగిరి, మర్రి నాగరాజు, ఊటుకూరి చిరంజీవి, వల్లె పర్వతాలు, బొట్ల ప్రతాప్, ధర్మారం క్రాంతి, నాగపురి సాగర్ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాలకు అతీతంగా ఏకం కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న దేవేందర్

- హక్కుల సాధన సమితి కన్వీనర్ దేవేందర్

నల్లబెల్లి : విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో వాటా దక్కించుకునే దిశగా పోరాటాలు నిర్మించేందుకు బీసీ రాజకీయాలకు అతీతంగా ఏకం కావాలని బీసీ హక్కుల సాధన సమితి గ్రామ కమిటీ కన్వీనర్ సామల దేవేందర్ కోరారు. మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జనాభా మేరకు బీసీలకు రాజకీయాల్లో వాటా లభించడం లేదన్నారు. బీసీలకు జరుగుతున్న నష్టాలపై అవగాహన కల్పించి చైతన్యవంతం చేయనున్నట్టు తెలిపారు. రాజకీయ పార్టీలు బీసీలకు సముచిత స్థానం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈనెల 13న స్థానిక ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్న సమావేశానికి బీసీలు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. సమావేశంలో సమితి కోకన్వీనర్లు మేడిపల్లి రాజు, పాండవుల రాంబాబు, బత్తిని మల్లయ్య, తంగెళ్ల భాస్కర్, బొద్దుల నర్సయ్య, నాగంపెల్లి మోహన్‌రావు, కోల లింగయ్య తదితరులు పాల్గొన్నారు.